సాక్షి
చిత్తూరు

బుధవారం । 7 । ఆగస్టు । 2024



నిర్దేశిత లక్ష్యాలు అధిగమించండి

అధికారులు సమన్వయంతో పనిచేసి బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో



కార్యకర్తలకు జగనన్న ఆర్థిక సాయం

టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన, ఆస్తులు నష్టపోయిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సాయం చేశారు. - 8లో



'వసతి'పై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

వసతి గృహాల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేశారు. - 8లో

న్యూస్‌రీల్

అంతా దుష్ప్రచారం

- ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్సీ భరత్



భరత్

కుప్పం: చంద్రబాబుపై ఎన్నికల్లో నిలబడి పోరాడుతున్నందుకే తనపై రాజకీయ కక్షతో దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీలో దర్శన టిక్కెట్ల కోసం గుంటూరు చెందిన సతీష్ అనే టీడీపీ నాయకుడి వద్ద డబ్బులు తీసుకున్నట్లు..దీనిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సోషల్ మీడియాలో మంగళవారం ఉదయం నుంచి ప్రచారం చేయడం తన దృష్టికి వచ్చిందన్నారు. వాస్తవానికి సతీష్ అనే వ్యక్తి ఎవరో తనకు తెలియదని, దర్శనం టిక్కెట్లు అమ్ముకునే దౌర్భాగ్య స్థితిలో తన కుటుంబం లేదన్నారు. అంతేకాకుండా తన దగ్గర పీఆర్‌ఓగా మల్లికార్జున పనిచేస్తున్నాడని, దర్శన టిక్కెట్ల కోసం డబ్బులు అతనికి ఇచ్చినట్లు ఫిర్యాదు చేసినట్లు ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి తనవద్ద పీఆర్‌ఓగా మల్లికార్జున అనే వ్యక్తే లేడని ఆయన స్పష్టం చేశారు. తనపై ఉద్దేశపూర్వకంగా బురదచల్లుతున్నారని, ఈ దుష్ప్రచారంపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో బుధవారం ఉదయం 11 గంటలకు 'విద్యుత్ గ్రీవెన్స్' నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆయా డివిజన్ల వినియోగదారులు సమస్యలను అధికారులకు నివేదిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

'సప్లిమెంటరీ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి'

- డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్

కార్వేటినగరం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రైవేటు యాజమాన్యంలోని డీఎల్‌ఈడీ కళాశాలల్లో 2018–20 బ్యాచ్‌కు సంబంధించి డీఎల్‌ఈడీ రెగ్యులర్, అలాగే స్పాట్ అడ్మిషన్‌తో చేరి ఫెయిల్ అయిన ఛాత్రోపాధ్యాయులు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ కోరారు. మంగళవారం డైట్ కార్యాలయంలో విలేకరులతో ప్రిన్సిపల్ మాట్లాడారు. 2018–20లో ఫెయిలై సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కాదలచిన విద్యార్థులు, ప్రస్తుతం ఆ ప్రైవేటు కళాశాలలు మూత బడినట్లయితే ఇక్కడి డైట్ కళాశాలలో ఫీజులు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. పూర్తి వివరాలకు 8500194152 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అధికార బలంతో పచ్చమూక రెచ్చిపోతోంది. అడ్డూ అదుపూ లేకుండా అరాచకాలకు పాల్పడుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులకు తెగబడుతోంది. ఊర్ల నుంచి దౌర్జన్యంగా తరిమికొడుతోంది. చివరకు ఫ్యాన్ గుర్తుకు ఓటేసిన వారిని సైతం వెంటాడి వేటాడుతోంది. కూటమి నేతల ఆగడాలకు గ్రామాలకు గ్రామాలనే ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. మూకుమ్మడిగా మీద పడి ఆస్తులను ధ్వంసం చేస్తుంటే ప్రాణాలు అరచేతితో పెట్టుకుని దాక్కుంటున్నారు. చేతికొచ్చిన పంటలను పొలంలోనే విడిచిపెట్టి ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. టీడీపీ గూండాల దాష్టీకాలకు వందలాది మంది పుట్టి పెరిగిన ఊరిని వదిలేసి బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. స్వేచ్ఛగా బయట తిరగలేక చిత్రహింసలు అనుభవిస్తున్నారు. బాధితుల పిల్లలు చదువుకు దూరమై కన్నీటిపర్యంతమవుతున్నారు.



శ్రీకాళహస్తిలో కోనేరు వద్ద ఉన్న బండపై నిద్రిస్తున్న కొత్తకండ్రిగకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గూడు వదిలి..

గుండె పగిలి..!

- టీడీపీ నేతల అరాచకాలకు ఖాళీ అవుతున్న గ్రామాలు
- ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వెళ్లిపోతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పుట్టి పెరిగిన పల్లెను విడిచిపెట్టి వలసబోతున్న కుటుంబాలు
- చదువుకు సైతం దూరమవుతున్న బాధితుల పిల్లలు
- పచ్చమూక ఆగడాలను పట్టించుకోని పోలీసులు



నిర్మానుష్యంగా ఈశ్వరయ్య కాలనీ

సాక్షి ప్రతినిధి, తిరుపతి : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రెండు నెలలుగా టీడీపీ రౌడీలు దారుణంగా దాడులకు పాల్పడుతున్నారు. ఫ్యాను గుర్తుకు ఓటేశారని కొందరిని, వైఎస్సార్‌సీపీ చెందిన మరి కొందరిని లక్ష్యంగా చేసుకుని అరాచకాలకు తెగబడుతున్నారు. టీడీపీ మూకల దాడుల్లో అనేక మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. ప్రాణభయంతో ఊరొదిలి వెళ్లిపోయారు. అలా వెళ్లని వారిని టీడీపీ నేతలు నిత్యం బెదిరిస్తూ ఊరొదిలి వెళ్లిపోవాలని హుకుం జారీ చేస్తున్నారు. పచ్చమూకల రాక్షస క్రీడలో అనేక మంది విద్యార్థులు బడులు, కళాశాలలకు వెళ్లలేక చదువుకు దూరమయ్యారు.

అడవిలో బిక్కుబిక్కుమంటూ..

పుంగనూరు నియోజక వర్గం సోమల మండలం కమ్మపల్లెలో వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ మూక దాడులు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో 13 కుటుంబాల వారు నరకం అనుభవిస్తున్నారు. వీరిలో సుబ్రమణ్యంరెడ్డి, ఆయన భార్య ఊరొదిలి వెళ్లిపోయారు. పుంగనూరులో కుమార్తె జయంతి వద్ద తలదాచుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ గూండాలు సోమవారం పుంగనూరు చేరుకుని సుబ్రమణ్యంరెడ్డి కోసం గాలించారు. ఇది పసిగట్టిన సుబ్రమణ్యంరెడ్డి కుటుంబం అర్ధరాత్రి ఊరు విడిచి అడవిలోకి వెళ్లిపోయింది. రెండు రోజుల పాటు బిక్కు బిక్కుమంటూ అక్కడే గడిపింది. అప్పటికీ వదిలిపెట్టని టీడీపీ గూండాలు సుబ్రమణ్యంరెడ్డి దంపతులను గ్రామానికి రప్పించాలని మిగిలిన 12 కుటుంబాల వారిని చిత్రహింసలకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలోనే నంజంపేట, సోమల, కందూరు, చౌడేపల్లెలో మరో 25 కుటుంబాలు ఊరొదిలి వెళ్లిపోయాయి. వారు ఎక్కడున్నారో ఇప్పటికీ తెలియని పరిస్థితి. రొంపిచర్ల మండలంలో సుమారు 300 కుటుంబాల వారు టీడీపీ నేతల దాష్టీకానికి భయపడి ఊరొదిలి పారిపోయారు. వారిని తిరిగి గ్రామానికి రప్పించేందుకు కొందరి నివాసాలు, షెడ్లు, ప్రహరీగోడలను సైతం పచ్చమూక కూల్చివేసింది. మామిడి తోటలను ధ్వంసం చేసింది. వైఎస్సార్‌సీపీకి ఓటేశారని కక్షతో అనేక మంది వ్యాపారుల దుకాణాలను మూయించి వేసింది.

రోజుకో చోట..

తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగకు చెందిన 15 కుటుంబాలు ఊరొదిలి వెళ్లి నెల అవుతోంది. రోజుకో చోట తలదాచుకుంటూ దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఆలయాలు, సత్రాలు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ల వద్ద కాలం గడుపుతున్నారు. భార్యల మెడలోని పుస్తెలు అమ్ముకుని రోజులు నెట్టుకొస్తున్నారు.

కనికరించండి.. చదువుకోవాలని ఉంది

టీడీపీ నేతల దౌర్జన్యానికి ఊరొదిలి వెళ్లిన కుటుంబాల్లో బడి ఈడు పిల్లలు ఉన్నారు. డిగ్రీ, ఇంటర్, పదో తరగతి విద్యార్థులు తమకు చదువుకోవాలని ఉందని తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఊర్లోకి వెళితే చావగొడతారని భయపడి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుని జీవనం సాగిస్తున్నారు. విద్యార్థుల గురించి తెలుసుకుని 'చేతులెత్తి మొక్కుతాం.. చదువుకోనివ్వండి' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు ఈశ్వరయ్యకాలనీ పరిధిలోని పాఠశాల ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. ఉపాధ్యాయులకు సంబంధం లేకపోయినా.. ఉన్నతాధికారులు వారికి నోటీసులు జారీ చేశారు. ఈ ఘటనలపై స్పందించాల్సిన పోలీసులు బాధ్యత మరచి వ్యవహరిస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతల అరాచకాలపై మానవహక్కుల సంఘం స్పందించాలని బాధితులు వేడుకుంటున్నారు.

అజ్ఞాతంలో పుంగనూరు వాసులు

పుంగనూరు నియోజక వర్గం సోమల మండల పరిధిలోని కమ్మపల్లె, నంజంపేట, సోమల, కందూరు, పుంగనూరు పరిధిలోని 25 కుటుంబాలు, రొంపిచర్ల మండలానికి చెందిన మరో 55 కుటుంబాలు టీడీపీ మూకల దాడులకు భయపడి తలా ఒక దిక్కుకు వెళ్లిపోయారు. వీరిని ఊర్లోకి రప్పించి చిత్రహింసలు పెట్టాలనే ఉద్దేశంతో పచ్చ గూండాలు విశ్వప్రయత్నం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా వారి ఫొటోలను షేర్‌చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

రాష్ట్రం కాని రాష్ట్రంలో..



ఈశ్వరయ్య కాలనీలో తాళాలు వేసి ఉన్న ఇల్లు

శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్యకాలనీకి చెందిన 30 కుటుంబాలవారు ఒడిశాలోని ఓ ప్రాంతంలో తలదాచుకుంటున్నారు. పరదాలతో టెంట్లు వేసుకుని భయం భయంగా కాలం గడుపుతున్నారు. కూలి పనులు చేసుకుని పొట్టపోసుకుంటున్నారు. పని దొరకని రోజు పస్తులుంటున్నారు. పాములు, విషపురుగులతో సహవాసం చేస్తూ ప్రాణాలు ఉగ్గబట్టుకుని బతుకున్నారు. స్కూలు, కళాశాలలకు వెళ్లాలని పిల్లలు మారం చేస్తున్నా ఊర్లోకి తీసుకెళ్లలేని దుస్థితిలో జీవనం సాగిస్తున్నారు.

ముక్కంటి చెంత రౌడీయిజం

శ్రీకాళహస్తి నియోజక వర్గం తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని 15 కుటుంబాలపై టీడీపీ రౌడీలు దాడికి దిగారు. వారి ఇళ్లలోకి చొరబడి దారుణంగా కొట్టారు. చేతులెత్తి దండంపెట్టినా వినకుండా విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. టీడీపీ నేతల ఒత్తిడితో తిరిగి బాధితులపైనే 307 సెక్షన్ కేసు నమోదు చేశారు. దాడికి తెగబడిన వారిపై మాత్రం తూతూ మంత్రంగా కేసుపెట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో చేసేదిలేక 15 కుటుంబాలు ఊరొదిలి వెళ్లిపోయాయి. శ్రీకాళహస్తి మండలం ఎంపేడు పంచాయతీ ఈశ్వరయ్యకాలనీకి చెందిన 30 షికారీ కుటుంబాలు రెండు నెలలుగా ఒడిశా రాష్ట్రానికి వెళ్లి తలదాచుకుని ఉన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేశారన్న అక్కసుతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు షికారీల నివాసాల్లోకి దూరి కర్రలు, రాళ్లతో దాడులు చేసి తీవ్రంగా గాయపరచారు. ఊరొదిలి వెళ్లాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో జూన్ 7వ తేదిన 30 కుటుంబాలు గ్రామాన్ని విడిచిపెట్టి పిల్ల,పాపలతో కలసి తట్టా, బుట్టా సర్దుకుని వెళ్లిపోయారు. ఊరొదిలిన వారిలో గ్రామ సర్పంచ్ సుమతి కూడా ఉన్నారు.



ఊరొదిలి వచ్చేసిన కొత్తకండ్రిగ వాసులు (ఫైల్)

చేనేతకు చేయూతేదీ?

వ్యవసాయం తరువాత అధిక జనాభా ఉపాధి పొందుతున్న చేనేత రంగం ఒడిదుడుకుల నడుమ సాగుతోంది. భారత స్వాతంత్య్రోద్యమ కాలంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్య్ర సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత. విదేశీ వస్త్రాలను బహిష్కరించాలన్న లక్ష్యంతో ఆగష్టు 7, 1905న స్వదేశీ ఉద్యమానికి ప్రధాన అంశంగా నిలిచింది. ఇంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న రోజును 2015లో జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించారు.

- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు
- బడ్జెట్‌లో కేటాయింపులకు ప్రాధానత్య ఇవ్వాలి
- 250 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలి
- నేతన్నల డిమాండ్
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

నగరి : చిత్తూరు జిల్లాలో 325 మంది మగ్గాలు కలిగిన చేనేత కార్మికులు ఉండగా 1200 మంది ఈ వృత్తిపై పరోక్షంగా ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. 10 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. గత ప్రభుత్వ పాలనలో ఐదు విడతల్లో ఒక్కో కుటుంబం రూ.1.20 లక్షల సాయం అందుకుంది. జిల్లా వ్యాప్తంగా 194 మంది చేనేత కార్మికులను గత ప్రభుత్వం 'నేతన్న నేస్తం' పథకంతో ఆదుకుంది. రూ. 2.20 కోట్ల వరకు వారికి ఆర్థిక సాయం అందజేసి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. నేతన్నలు ఫెడల్ లూమ్స్, నూతన డిజైన్లు ఇచ్చే జక్కార్డ్‌లు, బాబిన్లు కొనుగోలు చేసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అదే కోవలో సాయం అందజేసి చేయూతనివ్వాలని నేతన్నలు కోరుతున్నారు.




చేనేత మగ్గం

జిల్లాలోని చేనేత మగ్గాలు ఉన్న కార్మికులు	325
చేనేతపై ఆధారపడి జీవించేవారు	1200
జిల్లాలో చేనేత ఉన్న మండలాలు	13
జిల్లాలో చేనేత సహకార సంఘాలు	10
చేనేత క్లస్టర్	1

చేనేత కార్మికుల డిమాండ్లు

- చేనేత కార్మికులకు రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలి
- చేనేత వస్త్ర ఉత్పత్తులకు జీరో జీఎస్టీని అమలు చేయాలి
- నూలు, సిల్క్, జరీలకు 50 శాతం సబ్సిడీ ఇవ్వాలి
- చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ 250 యూనిట్లు అమలు చేయాలి
- చేనేత రంగంలో 70 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు. వారికి ప్రత్యేక పథకాలను అమలు చేయాలి
- చేనేత రంగ అనుబంధ వృత్తుల వారికి సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేయాలి
- చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి
- గృహం, వర్క్ షెడ్ పథకాన్ని అమలు చేయాలి
- ఇల్లు లేని వారికి మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలి
- గతంలో జీవిత బీమా సంస్థ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన ఇన్సూరెన్స్ పథకాన్ని తిరిగి అమలు చేయాలి
- నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.36,000 చొప్పున ఇవ్వాలి
- చేనేత మగ్గాలు కలిగిన గ్రామాల్లో నూతన సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి
- ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికులకు 7 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి
- రాష్ట్ర చేనేత అభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలి
- 60 ఏళ్ల పైబడిన నేతన్నలకు పెన్షన్ రెట్టింపు చేయాలి
- జీవితకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారికి పెన్షన్ రూ.15000 చొప్పున ఇవ్వాలి.


చేనేత వస్త్రాలకు జీఎస్టీ మినహాయింపు ప్లీజ్!



చేనేత రంగాన్ని బలోపేతం చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలి. చేనేత వస్త్రాలకు జీఎస్టీ మినహాయించాలి. చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని బ్యాంకు రుణాలు ఇవ్వాలి. ఉపాధికి ఆర్థికంగా తోడ్పాటునివ్వాలి. రాష్ట్ర చేనేత అభివృద్ధి మండలి ఏర్పాటు ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఆకుల వాసు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్ అధ్యక్షుడు


బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మిక జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో చేనేత రంగానికి బడ్జెట్ కేటాయించాలి. రూ.200 కోట్లు మాత్రమే కేటాయిస్తున్నారు. ఇది ఏమాత్రం సరిపోవడం లేదు. చేనేత కార్మికులకు రాష్ట్ర బడ్జెట్లో వెయ్యి కోట్లు కేటాయించాలి. గృహం, వర్క్ షెడ్ పథకాన్ని అమలు చేయాలి.

– పీవీ కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు, చేనేత కార్మిక యూనియన్, సదుం

250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి



చేనేతకు 250 యూనిట్లు ఉచితంగా అందిస్తామని ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఈ మేరకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలి. నేతన్ననేస్తం ఏడాదికి రూ.36 వేలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. జీవితకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారికి పెన్షన్ ఇవ్వాలి.

– బాలాజి, చేనేత యూనియన్‌కు జనరల్ సెక్రటరీ, చిత్తూరు జిల్లా

చేనేత చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి



మరమగ్గాల వారు 11 రకాల రిజర్వేషన్ చట్టాలను ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలి. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చేనేత సహకార వ్యవస్థను, ఆప్కోను బలోపేతం చేయాలి. ఇన్సూరెన్స్ పథకాన్ని మళ్లీ అమలు చేయాలి.

– కుప్పయ్యశెట్టి, జిల్లా గౌరవాధ్యక్షుడు, చేనేత కార్మిక యూనియన్, మాంగాడు

ఇంటిపై టీడీపీ జెండా కట్టలేదని
ఓ కుటుంబంపై దాడి

- ఆరుగురికి తీవ్ర గాయాలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- కుప్పంలో కొనసాగుతున్న టీడీపీ అరాచకాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ఇంటిపై పచ్చ జెండా కట్టనందుకు ఓ కుటుంబంపై టీడీపీ మూకలు విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరచిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలో రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బాధితుల కథనం మేరకు.. రామకుప్పం మండలం జోకుపల్లెకు చెందిన ధనుంజయ సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్నారు. ధనుంజయ కుటుంబం వైఎస్సార్‌సీపీకి ఓటేశారని తెలిసి టీడీపీ మూకలు ఆ రాత్రి అక్కడికి చేరుకున్నాయి. ఇంటిపై టీడీపీ జెండా కట్టమని హుకుం జారీ చేశాయి. తాను కట్టనని తేల్చి చెప్పారు. కట్టి తీరాల్సిందేనంటూ టీడీపీకి చెందిన నవీన్, పళని, శ్రీనివాసులు, సురేష్, కృష్ణమూర్తి తదితరులు మూకుమ్మడిగా ఒకే కుటుంబానికి చెందిన ధనుంజయ, మురుగేష్, సుబ్రమణ్యం, దేవి, సుకన్య, లక్ష్మమ్మపై దాడికి తెగబడ్డారు. తీవ్రంగా గాయపడ్డ ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,094 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 23,127 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి హుండీ ద్వారా రూ.3.72 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఖరీఫ్..ఉఫ్..!


గుడిపాలలో వాడిపోయిన వేరుశనగ పంట

ఖరీఫ్ 'కంది'పోతోంది. వేరుశనగ పంట సాగు అదును ముగిసి వాడిపోతోంది. తొలినాళ్లలో వర్షాలు ఆశాజనకంగా కురిసినా పంటల సాగు గణనీయంగా తగ్గింది. దీనికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వక మొండిచెయ్యి చూపడం రైతాంగానికి శాపంగా మారింది. ఈ ప్రభావం ఖరీఫ్ సీజన్‌ను పూర్తిగా దెబ్బతీసింది. ఫలితంగా ఖరీఫ్ ఆశలు ఆడియాశలయ్యాయి.

- గణనీయంగా తగ్గిన వేరుశనగ, కంది సాగు
- 33,920 హెక్టార్లల్లోనే కంది సాగు
- వేరుశనగ సాగు 13,044హెక్టార్లు మాత్రమే
- విత్తనకాయల సరఫరా కూడా అరకొరే
- పెట్టుబడి సాయం ఇవ్వని కూటమి ప్రభుత్వం
- పంటల సాగుపై చూపిన ప్రభావం

కాణిపాకం: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా వేరుశనగ సాగు చేయడం పరిపాటి. ఈ ఏడాది అదును అనుకూలించి, వర్షాలు కురిసినా జిల్లాలో వేరుశనగ సాగు తగ్గింది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 81,169 హెక్టార్లు కాగా 33,920 హెక్టార్లు మాత్రమే సాగులోకి వచ్చింది. ఇందులో వేరుశనగ సాధారణ విస్తీర్ణం 43,174 హెక్టార్లు అయితే 13,044 హెక్టార్లలో మాత్రమే విత్తుపడింది. ఇక కందులు 3,021 హెక్టార్లకు గాను 653 హెక్టార్లలో మాత్రమే వేశారు..ఇతరత్రా పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. అదును ముగిసే సమయానికి (జూలై ఆఖరు) సాగు విస్తీర్ణం పెరుగుతుందనే అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి.

వేరుశనగ విత్తనాలు మాత్రమే..!

గత ప్రభుత్వ పాలనలో ఖరీఫ్ మొదట్లోనే రైతులకు విత్తనాలు పంపిణీ చేసి, 'రైతు భరోసా' కింద పెట్టుబడి సాయాన్ని అందజేసింది. అలాగే వేరుశనగతో పాటు, కంది, జనుము, అలసంద, మినుములు ఇచ్చేది. ఏటా 40వేల క్వింటాళ్లకు పైగా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసి సమాయత్తం చేసేది. రైతులు వర్షాభావ పరిస్థితులను బట్టి వేరుశనగతో పాటు ప్రత్యామ్నాయ పంటలను కూడా సాగు చేసేవారు. ఈసారి ఎన్నికల కౌంటింగ్ ముందే వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం రైతులను అసలు పట్టించుకోలేదు. ఖరీఫ్ దృష్ట్యా ఇవ్వాల్సిన విత్తనాలకు ఎసరు పెట్టింది. అంతేకాకుండా అంతర పంటల సాగుకైనా విత్తనాలు ఇవ్వండి మహాప్రభో అని రైతులు కోరుతున్నా వారి గోడు అరణ్య రోదనే అయ్యింది.

భరోసా ఏది 'బాబూ'?

ఖరీఫ్‌ను వేగవంతం చేయడంతో పాటు విస్తీర్ణంను పెంచేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీజన్ ఆరంభంలోనే రైతు భరోసాను అమలు చేసేది. ఏటా 4,39,167 మంది రైతులకు రూ.330 కోట్ల వరకు వారి ఖాతాలో జమ చేసేది. ఈ సాయంతో రైతులు భూములను దుక్కులు దున్ని వేరుశనగ విత్తుకునేవారు. వేసిన పంటకు ఈ–క్రాప్ నమోదుతో అండగా నిలుస్తూ.. బీమా కల్పించేది. ఇలా ప్రతి ఏటా 89,538 మంది రైతులకు రూ.52.77 కోట్ల మేర చెల్లించేది. దీంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో అప్పులు చేసే పనిలేకుండా, నిశ్చింతగా పంటలను సాగుకు పూనుకునేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సమయంలో 'అన్నదాత సుఖీభవ' పేరుతో రైతులకు పెట్టుబడి సాయంగా రూ. 20వేలు ఇస్తామని ప్రకటించింది. ఇంత వరకు సుఖీభవ విషయంలో స్పష్టత ఇవ్వలేదు. వేసిన పంటలకు బీమా లేక పోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు.

దీనికి ప్రధాన కారణం తమను ప్రస్తుత ప్రభుత్వం ఆదుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు.

వాడిపోతున్న వేరుశనగ

ప్రభుత్వం తర్వాతైనా సాయం చేయకపోదా!? అనే ఆశతో కొందరు రైతులు ధైర్యం చేసి సాగు చేసిన పంటలు ప్రస్తుతం వాడిపోతున్నాయి. చాలా చోట్ల వేరుశనగ పంట వాడిపోయింది. తొలి అదునుకు వేసిన పంట చాలా వరకు దెబ్బతింటోంది. మూడు నెలలుగా 80 మి.మీ వర్షపాతం నమోదైనా వేరుశనగ పంట కోలుకోలేని పరిస్థితి. వరుసగా రెండు మూడు రోజుల వర్షాలు పడడం..ఆ తర్వాత దోబూచులాడడంతో ఖరీఫ్‌కు కష్టకాలం తప్పలేదు. ప్రస్తుతం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు వేరుశనగ పంటకు కాస్త ఊపిరి ఇచ్చినా ఆశించిన మేర ఫలితం మాత్రం ఉండదని రైతులు తేల్చి చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయంతో పాటు..బీమాతో ధీమా కల్పించాలని కోరుతున్నారు.

వర్షపాతం వివరాలు..

నెల	కురిసిన వర్షపాతం మి.మీ	సాధారణ వర్షపాతం మి.మీ
జూన్	188.9	80.8
జూలై	89.8	103.9
ఆగస్టు	16.4	122.1

వేరుశనగ విత్తన పంపిణీ సమాచారం..

విత్తన రకం	2023లో పంపిణీచేసిన కాయలు క్వింటాళ్లలో	2024లో పంపిణీచేసిన కాయలు క్వింటాళ్లలో
కే–6	39584.7	36560.7
నారాయణి	1427.1	1520.7

గతేడాది..ప్రస్తుత ఖరీఫ్‌సాగు వివరాలు..

పంట రకం	2023–సాధారణ విస్తీర్ణం హెక్టార్లలో	2023–సాగు విస్తీర్ణం హెక్టార్లలో	2024–సాధారణ విస్తీర్ణం హెక్టార్లలో	2024–సాగు విస్తీర్ణం హెక్టార్లలో
వేరుశనగ	51266	15170	43174	13044
కందులు	3920	530	3261	653
వరి	9019	8174	9704	3905
రాగి	3758	905	3101	418
ఉలవలు	3370	1629	2964	350
సజ్జలు	517	542	566	427
చెరకు	9824	6115	8526	3809

దుడ్డు ఈలా..పంట వేయలా..



ఖరీఫ్‌కు ముందు దుడ్డు వస్తా ఉండేది. ఆ దుడ్డుతో వేరుశనగ వేస్తా ఉంటిమి. ఇప్పుడు దుడ్డు ఈలేదు. చేతి నుంచి పెడితే..మా చేతులు కాల్చుకోవాలా? ఎందుకొచ్చింది స్వామీ. అందుకే గమ్మునే ఉంటే పోలా అని వేరుశనగ వద్దన్ని సాలించుకున్నాం. మావోళ్లు కొద్దొ గొప్పొ వేసుకున్నారు. బీడుగా ఎందుకు పెట్టుకోవాలని పంట వేసినారు. అది కూడా వాడిపోతా ఉండాది. ప్రభుత్వం సాయం చేస్తే బాగుంటాది. – యువరాజ్, జీడీనెల్లూరు

చట్నీకి కూడా దిగుబడి రాదు



వేరుశనగ పంట వాడిపోతోంది. వర్షాలు అడపదడపా కురుస్తుంటే ఈ సమస్య ఉండదు. కురిస్తే వరుసగా పడుతోంది. లేకుంటే 20 రోజులు కూడా వర్షాలు ఉండవు. ఈ కారణంగానే వేరుశనగ పంట వాడిపోయే పరిస్థితి కలిగింది. ఇక దిగుబడి లేదు. ఆ దిగుబడి చట్నీకి కూడా రాదు. తీగలైనా మిగిలితే చాలు దేవుడా అని రైతులు ఆశిస్తున్నారు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి. –జయరామిరెడ్డి, పూతలపట్టు

ప్రత్యామ్నాయంపై అవగాహన కల్పిస్తాం



జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ సాగు ఆశించిన మేర విస్తీర్ణం పెరగలేదు. దీనికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాం. త్వరలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పిస్తాం. ఈ విత్తనాలను కూడా త్వరలో రైతులకు అందేలా చర్యలు తీసుకుంటాం. –మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

క్లుప్తంగా

గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా అధికారులు


గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలో మేలుపట్లలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను జిల్లా గిరిజన సంక్షేమాధికారి మూర్తి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ప్రభావతి సందర్శించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'డెంగీతో గురుకులం విద్యార్థి మృతి' శీర్షికతో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. స్థానిక మెడికలాఫీసర్ డాక్టర్ జయేష్, డాక్టర్ జయసింహతో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే విద్యార్థి పూర్ణిమ మృతికి దారితీసిన పరిస్థితులు, లేఖను మార్చిన వైనంపై విచారణ చేశారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక డంప్‌లు సీజ్

సాక్షి ఎఫెక్ట్..


ముసలిమొడుగు వద్దసీజ్ చేసిన ఇసుక డంపులు

పలమనేరు: పలమనేరు మండలం పెంగరగుంట పంచాయతీ ముసలిమొడుగు వద్ద కౌండిన్య నదిలోంచి అక్రమంగా తరలించి పొలాల వద్ద నిల్వ చేసిన డంపులపై ఆర్డీఓ మనోజ్‌రెడ్డి, తహసీల్దార్ ఇన్బనాథన్ మంగళవారం దాడులు చేశారు. పలు డంపులను సీజ్ చేశారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు 200 లోడ్ల ఇసుక నిల్వలున్నాయంటూ అధికారులకు పిర్యాదు చేశారు. ఇదే విషయమై ఈనెల 4న 'ఇసుక డంప్‌లను సీజ్‌చేయండి' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఆ గ్రామ సమీపంలోని డంపులపై దాడులు చేశారు. అయితే దీనిని ముందుగానే పసిగట్టిన పచ్చ నేతలు టిప్పర్లతో ఇసుకను పొరుగు రాష్ట్రాలకు తరలించినట్టు తెలిసింది. ఎట్టకేలకు అక్కడక్కడ మిగిలిన ఇసుకను మాత్రమే అధికారులు సీజ్ చేసి సంబంధిత వీఆర్వోకు అప్పగించారు. దీనిపై మైనింగ్ అధికారులకు సమాచారం చేరవేశారు. ఇసుకను తరలిస్తున్న వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు.

కార్యకర్తలకు జగనన్న ఆర్థిక సాయం

- టీడీపీ దాడుల్లో నష్టపోయిన, గాయపడిన కార్యకర్తలకు చెక్కుల పంపిణీ
- కార్యకర్తలకు అండగా ఉంటామన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్

ఐరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఎల్లవేళలా అండగా ఉంటారని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల దాడుల్లో ఆస్తినష్టానికి గురైన యాదమరి మండలం చిన్నరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఖదీర్, గౌస్‌బాషా, జాకీర్‌కు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కొకరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం పంపారు. మంగళవారం మండలంలోని ఎం.పైపల్లెలో సునీల్‌కుమార్ తన స్వగృహంలో బాధితులకు చెక్కులు అందజేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలుకుని ప్రజా సేవకు బదులు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు చేయడమే పనిగా పెట్టుకుని ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతోందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడరాదని, వారి దౌర్జన్యాలకు భయపడేది లేదన్నారు. ప్రజల కోసం అన్యాయాలపై ఎదిరించి పోరాడతామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తే రాబోవు రోజుల్లో ప్రజాగ్రహం చవిచూడకతప్పదని హెచ్చరించారు. ఇప్పటికే చిరుద్యోగులు, పాడిరైతులు, విద్యార్థులు ఆందోళన పట్టారని, సమస్యలపై కలెక్టరేట్లను సైతం ముట్టడిస్తున్నారని గుర్తు చేశారు. రెండు నెలల వ్యవధిలోనే ఇంతటి వ్యతిరేకత మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు స్వస్తి పలకకపోతే ప్రజలే ఉద్యమిస్తారని హెచ్చరించారు.

కుప్పానికి గ్రానైట్ శిల్పాల తయారీ యూనిట్


అధికారులతో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో గ్రానైట్ కార్మికులు అధికంగా ఉండడంతో వారికి జీవనోపాధి కల్పించే దిశగా గ్రానైట్ శిల్పాల తయారీ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ పీ.శ్రీనివాసులు వెల్లడించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన అధికారులతో సమీక్షించారు. గ్రానైట్ శిల్పాల తయారీ యూనిట్ ఏర్పాటు నిమిత్తం అవసరమైన 15 నుంచి 20 ఎకరాల భూమిని గుర్తించాలని తహసీల్దార్లను ఆదేశించారు. అలాగే ఈ పరిశ్రమకు సంబంధించి ముడిసరుకు ఖరీదు, మార్కెటింగ్ సదుపాయాలు, నీరు, రవాణా..ఇత్యాది వాటిపై పరిశీలించాలన్నారు. 100 మంది శిల్పులు, గ్రానైట్ ముడి సరుకు సరఫరాదారులతో సర్వే చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. ఇందుకోసం కుప్పం ఆర్డీఓ, దేవదాయశాఖ సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారులను ఒక బృందంగా నియమించినట్లు చెప్పారు. సమావేశంలో కుప్పం ఆర్డీఓ శ్రీనివాస్‌రాజు, జిల్లా పారిశ్రామిక అధికారి సంజీవరాజు, దేవదాయశాఖ అధికారి శ్రీలక్ష్మీ ప్రసన్న, నాయకులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

– స్టేషన్‌కు వెళ్లిన ఇరువర్గాలు


పుంగనూరు: అధికార పార్టీలో 60 రోజులకే ఆధిపత్య పోరుతో విభేదాలు భగ్గుమన్నాయి. సోమవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పుంగనూరులో పర్యటించారు. ఒక వర్గానికి చెందిన వ్యక్తులు మంత్రిపై పూలు చల్లారు. ఆ సమయంలో మరో వర్గానికి చెందిన కార్యకర్తలు ఒకరినొకరు కొట్టుకున్నారు. అక్కడితో వివాదం సమసిపోలేదు. దెబ్బలు తిన్న వర్గం నాయకుడు కొట్టిన వారిని పట్టుకుని మంగళవారం ఉదయం కొట్టడంతో మరో వర్గం నాయకులు రగిలిపోయారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్లాబాబు జోక్యం చేసుకుని ఇరు వర్గాలు ఫిర్యాదులు చేసుకోకుండా తన వద్దకు రావాలని ఆదేశించారు. దీంతో ఇరువర్గాలు చేసేదేమీ లేక ఫిర్యాదులు ఇవ్వకనే వెనుదిరిగాయి.

నిర్దేశిత లక్ష్యాలు అధిగమించండి

- బిందు, తుంపర్ల సేద్యం లక్ష్యం 21 వేల హెక్టార్లు
- పకడ్బందీగా రైతుల రిజిస్ట్రేషన్
- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 21 వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం చేయాలని నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులకు సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బిందు, తుంపర్ల సేద్యానికి అవసరమైన పరికరాలను సబ్సిడీపై ఇచ్చి రైతులను ప్రోత్సహించాలన్నారు. వంద రోజుల కార్యాచరణలో జిల్లాలో 3500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం పూర్తి చేయాలన్నారు. రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఫలితాలు రాబట్టాలని, క్షేత్రస్థాయిలో ఈ పంట నమోదు పకడ్బందీగా చేయాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష్యం 7,500 ఎకరాలు నిర్దేశించామని, ఇందులో ఇప్పటికే 5,500 ఎకరాలను గుర్తించినట్లు డ్వామా పీడీ రాజశేఖర్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, బిందు సేద్యంకు సంబంధించి ఐదు ఎకరాల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90శాతంతో ఒక రైతుకు గరిష్టంగా రూ.2.18 లక్షల రాయితీ, ఐదు నుంచి పది ఎకరాల కలిగిన రైతులకు 70శాతంతో ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.3.46 లక్షల రాయితీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ, ఈ–పంట నమోదుకు సంబంధించి ఇప్పటివరకు జిల్లాలో 259 హెక్టార్లు పూర్తి చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి శోభారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ సాయం అభినందనీయం


కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న ఆటో డ్రైవర్ రమేష్‌బాబు

కేరళ వరద బాధితుల సహాయ నిధికి గుడిపాల మండలం 189 కొత్తపల్లెకు చెందిన ఆటోడ్రైవర్ రమేష్‌బాబు రూ.3,300 విరాళంగా కలెక్టర్‌కు అందజేశాడు. దీనిపై ఆయన స్పందిస్తూ, ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించే ఆటోడ్రైవర్ తన వంతు ఆర్థిక సహాయం చేయడం గొప్ప విషయమని అభినందించారు.

'వసతి'పై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, విద్యార్థులు

- కలెక్టరేట్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ ధర్నా
- హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి ఆరోపించారు. హాస్టళ్లలో తిష్ట వేసిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారంకలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ధర్నా చేశారు. చలపతి మాట్లాడుతూ, జిల్లాలో పాతబడిన వసతి గృహాల్లో విద్యార్థులు సౌకర్యాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా వందకు పైగా వసతి గృహాలుంటే వీటిలో దాదాపు 70 శాతం గృహాలు పాతబడి, కూలే స్థితిలో ఉన్నాయని, విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్‌చేశారు. అలాగే బీసీ ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. జిల్లా కన్వీనర్ ప్రవీణ్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా వసతి గృహాల్లో పనిచేస్తున్న ట్యూటర్లకు కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, వారికి వెంటనే జీతాలు విడుదల చేయాలన్నారు. డిగ్రీ అడ్మిషన్ల ఆన్‌లైన్ విధానాన్ని రద్దుచేసి ఆఫ్ లైన్‌లో నిర్వహించాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను చంద్రబాబునాయుడు నెరవేర్చకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి డీఆర్‌ఓ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో జిల్లా నాయకులు మున్నా, ప్రేమ్, సమీర్, బాలాజి, సునీల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రి రిపోర్టుల ఆధారంగా బడ్జెట్

- ఆన్‌లైన్‌లో తప్పిదాలు లేకుండా డాటా నిక్షిప్తం చేయండి
- వైద్యశాఖ రాష్ట్ర గణాంక సహాయ సంచాలకులు శ్రీనివాసరావు


ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర గణాంక సహాయ సంచాలకులు శ్రీనివాసరావు

పలమనేరు: ఆస్పత్రులకు సంబంధించి రోగులు, వారికి చేస్తున్న చికిత్స, రెఫర్లు..ఇత్యాది వాటిపై ఎప్పటికప్పుడు డాటాను ఆన్‌లైన్ చేయాలని వైద్యశాఖ రాష్ట్ర గణాంక సహాయ సంచాలకులు శ్రీనివాసరావు ఆదేశించారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్ డాటాతో కొన్ని తప్పులు ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఆయన ఆస్పత్రి వైద్యులు, స్టాటిస్టికల్ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం డ్యాష్ బోర్డులో సైతం ఎప్పటికప్పుడు కనిపించే డాటా కరెక్ట్‌గా ఉండాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రికి సంబంధించిన రిపోర్టుల ఆధారంగానే బడ్జెట్ కేటాయింపులు, ఆస్పత్రికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని తప్పిదాలు లేకుండా డాటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ జిల్లా గణాంకాధికారి జార్జి, స్థానిక ఆస్పత్రి సూపరిండెంటెంట్ మమతారాణి, ఆర్‌ఎంఓ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్లెస్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ చిన్నగోవింద్

గంగవరం: నెక్లెస్ చోరీ కేసులో నిందితుడిని గంగవరం పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సీఐ చిన్నగోవింద్ తెలిపిన వివరాలు..మండలంలోని కీలపట్ల గ్రామం కంసలవీధిలో కాపురం ఉంటున్న కుమరేశ్ అతని కుటుంబ సభ్యులు 2వ తేదీ ఉదయం ఇంటికి తాళాలు వేసుకుని పని మీద బయటకు వెళ్లారు. ఇదే రోజు సాయంత్రం ఆగంతకులు తాళం పగలగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలోని 32 గ్రాముల బంగారు నెక్లెస్‌ను చోరీ చేశారు. అనంతరం ఇంటికొచ్చిన కుమరేశ్ కుటుంబ సభ్యులు తమ ఇంట దొంగలు పడినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పనోడే దొంగ..!

కుమరేశ్ మామిడితోపులో పని చేసే గురుమూర్తిపై అనుమానం కొద్దీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అతడే చోరీ చేసినట్లు తేలింది. తన యజమాని కుటుంబంతో సహా బయటకు వెళ్లడంతో చోరీకి పాల్పడినట్లు నిందితుడు పోలీసులకు వెల్లడించాడు. ఆ నెక్లెస్‌ను పలమనేరులోని ఫైనాన్స్ కంపెనీలో తన స్నేహితుడి ద్వారా రూ. 20 వేలకు తాకట్టుపెట్టి జల్సా చేసినట్లు చెప్పాడు. ఆ నెక్లెస్‌ను ఫైనాన్స్ కంపెనీ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురుమూర్తిని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.